www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 2 ఏప్రిల్ 2025
5
అన్నమయ్య

బెట్టింగ్ సంస్కృతికి స్వస్తి పలుకుదాం

ప్రజాశక్తి-పీలేరు

బెట్టింగ్ సంస్కృతికి స్వస్తి పలుకుదామని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ తెలిపారు. మంగళవారం పీలేరులో బెట్టింగ్ సంస్కృతికి వ్యతిరేకంగా ప్రచారంలో భాగంగా ఎన్ఎస్‌యుఐ నాయకులు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెట్టింగ్ అనేది ఒక విష వలయమని తెలిపారు. విద్యార్థులు, యువత, ప్రజలు ఆ ఉచ్చులో పడకుండా దూరంగా ఉండాలని హితవు పలికారు. యువత సరదా కోసం కూడా బెట్టింగ్ జోలికి వెళ్లొద్దని సూచించారు. ఈ బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు మొదట లాభాలు చూపి ఆ తర్వాత సర్వం దోచేస్తారని అప్రమత్తం చేశారు. బెట్టింగ్ అనేది సరదాగా మొదలై ఆ తర్వాత అది వ్యసనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మనం బాధ్యతగల యువకులుగా ప్రజలకు బెట్టింగ్ నష్టాలపై అవగాహన కల్పించి చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సి.సాయి సంపత్ కుమార్, అఖిల్, దినేష్, లోకేష్, సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

కదంతొక్కిన మున్సిపల్ కార్మికులు

- ఆప్కాస్ రద్దు నిర్ణయం ఉపసంహరించుకోవాలి
- కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నాలో నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్మికులు పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. ఎక్కడికక్కడ కదంతొక్కారు. రాయచోటి, రాజంపేట, మదనపల్లె మున్సిపల్ కార్యాలయాల వద్ద మంగళవారం కార్మికులు ధర్నాలు చేశారు. ఆప్కాస్ రద్దు నిర్ణయం ఉపసంహరించుకోవాలని, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, గ్రాట్యుటీ వర్తింపజేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సమాన పనికి సమాన వేతనం, రాతపూర్వకంగా ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని, తదితర డిమాండ్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చకుంటే ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు మాట్లాడుతూ ఆప్కాస్‌లో ఉన్న మున్సిపల్ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులు కాదని, వారికి వర్తించే ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచడం సాధ్యం కాదని, గ్రాట్యుటీ వర్తించదంటూ మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ జారి చేసిన సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ అనే సంస్థ ప్రభుత్వ అధికారుల ఆధీనంలో నడుస్తున్న సంస్థ అని అవుట్ సోర్సింగ్ ఏజన్సీల కోసం ఏర్పాటు చేసినట్లు సాంకేతిక కారణాలను సాకుగా చూపి చట్టబద్ధంగా అమలు కావలసిన గ్రాట్యుటీ పథకం అమలు నిరాకరించడం ప్రభుత్వ నిరంకుశ చర్యలకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల అయితేనే గ్రాట్యుటీ వర్తిస్తుందనే అర్థంలో ప్రభుత్వం చెప్పడం అవివేకంతో కూడుకున్న చర్య అని యజమాని కార్మికుడు సంబంధం ఉన్న ప్రతి సంస్థలోనూ ఉద్యోగులు, కార్మికులు ఎవరికైనా గ్రాట్యూటీ వర్తిస్తుందని తెలిపారు. ఆప్కాస్ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులు కాదని ఇప్పుడు చెప్తున్న ప్రభుత్వం నాలుగేళ్లుగా 60 ఏళ్లు నిండిన వారిని ఉద్యోగులు అనే కారణంతో ఉద్యోగాల నుండి బలవంతంగా ఉద్యోగ విరమణ చేయించారు. గత వైసిపి ప్రభుత్వంలో ఆప్కాస్ ప్రారంభించినా ప్రస్తుత తెలుగుదేశం కూటమి పభుత్వం కూడా ఆ ప్రభుత్వ అడుగుల్లోనే నడుస్తూ 9 నెలల్లో వందలాది మందిని 60 ఏళ్లు నిండాయనే సాకుతో ఉద్యోగాల నుండి బలవంతంగా రిటైర్మెంట్ చేయించారన్నారు. ప్రభుత్వం నిరంకుశ పద్ధతుల్లో జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించి మునిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులందరికీ 17 రోజులు సమ్మె సందర్భంగా ప్రభుత్వం వ్రాతపూర్వకంగా ఇచ్చిన ఒప్పందం మేరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో కూడిన ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలి లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన పోరాటాలకు పూనుకోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వాసుబాబుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వి.రమణ, పట్టణ ఆధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.చెన్నయ్య, సి.రాంబాబు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** ఆప్కాస్ విధానం రద్దు చేస్తే మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన ఆప్కాస్ విధానం రద్దు చేయాలని కోరుతూ పురపాలక కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు గత 23 సంవత్సరాలుగా ఆప్కాస్ విధానంలో పనిచేస్తూ ఉండేవారని తెలిపారు. వారిని శాశ్వత ప్రాతిపదికన నియమిస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆప్కాస్ రద్దు చేసి కార్మికులను కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించాలని చూస్తోందని పేర్కొన్నారు. దీనివల్ల కాంట్రాక్టర్లకు లాభాలు తప్ప కార్మికులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పునరాలోచించి మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేసి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ, కోశాధికారి లక్ష్మీదేవి, నాయకులు ఓబయ్య, ప్రసాద్, రమణ, ప్రమీల, బాలాజీ, శీను, రమేష్ బాబు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** మున్సిపల్ పారిశుధ్య కార్మికులను పర్యవేక్షిస్తున్న ఆప్కాస్‌ను రద్దు చేస్తే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానానికి స్వస్తి చెప్పి ప్రతి ఒక్కరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని నమ్మబలికిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అప్కాస్‌ను రద్దు చేసి తిరిగి కాంట్రాక్టర్లకు దోచిపెట్టడానికి ఏజెన్సీ విధానాలను తీసుకొస్తామని ప్రకటనలు చేయడం సబబు కాదన్నారు. అప్కాస్‌ను రద్దుచేసి కార్మికుల జీవితాలతో చెలగాటమాడాలని చూస్తోందని ఇది చాలా దుర్మార్గమన్నారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఆప్కాస్‌ను రద్దుచేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. లేని పక్షంలో అంతవరకు ఆప్కాస్ విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకూ ఆప్కాస్ విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా ఉద్యమం చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీలను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చలపతి నాయుడు, సాంబశివ నాయక్, కోశాధికారి రామకృష్ణ, ఉపాధ్యక్షులు రాజు, గోపాల్, చిన్న రెడ్డప్ప, నరసింహులు, బాలకృష్ణ, సహాయ కార్యదర్శులు శ్రీరాములు, మునిస్వామి నాయక్, అరవింద్, చంద్ర, సభ్యులు కృష్ణప్ప, చంద్ర, శంకర్ నాయక్, తులసమ్మ, వెంకట్రమణ, రాధమ్మ పాల్గొన్నారు.

రాయచోటి : నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

మదనపల్లె : నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

రాజంపేట : నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రాధాన్యత

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదలకు ప్రభుత్వం వినూత్నంగా పంచ ప్రాధాన్యాల లక్ష్యాన్ని నిర్దేశించిందని అభివృద్ధి పథకాలను చేపడుతున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా నిర్దేశించిన పంచ ప్రాధాన్యాలలో భాగంగా పశువుల నీటి తొట్టెల నిర్మాణం చేపట్టుట, లక్ష్యం మేరకు ఫారం పాండుల నిర్మాణం, పంట కాలువల పూడిక తీత, సాగునీటి చెరువులలో పూడిక తీత, ఉపాధి కూలీలకు సగటు వేతనం రోజుకు కనీసం రూ.290 ఉండేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 2025- 26లో మొదటి త్రైమాసికానికి రూ.266 కోట్ల లక్ష్యంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. రూ.85.52 కోట్ల అంచనాతో 11 వేల ఫారం పాండ్ల నిర్మాణం, రూ.21.71 కోట్ల అంచనాతో పంట కాలువలలో పూడికతీత, రూ.3.47 కోట్ల అంచనాతో 1034 పశువుల నీటి తొట్టెల నిర్మాణం, రూ.5.56 కోట్ల ఖర్చుతో సాగునీటి చెరువులలో పూడిక తీయుట, రూ.150.43 కోట్ల అంచనాతో వేతన జీవులకు 49 లక్షల పని దినాలు కల్పించడమే లక్ష్యంగా ఉపాధి హామీ పథకం ద్వారా కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఆదాయం చేకూర్చే అతి పెద్ద రంగం లైవ్‌స్టాక్‌గా గుర్తించడం జరిగింది. దీన్ని మరింత ప్రోత్సహించేందుకు మరియు పశువుల మేత సమస్య ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో ఈ ఏడాది పదివేల ఎకరాలలో జిల్లాలో పశుగ్రాసం పెంచేందుకు ముఖ్యమంత్రి లక్ష్యాన్ని నిర్దేశించారు. ఒక్కొక్క నియోజకవర్గంలో దాదాపు 1500 ఎకరాలు, ప్రతి మండలంలో దాదాపు 500ఎకరాలలో పశుగ్రాసం పెంచేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. ఉపాధి హామీ నిధుల అనుసంధానంతో పంచాయతీరాజ్ శాఖల భాగస్వామ్యంలో వార్షిక లక్ష్యాలను కూడా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వార్షికంగా రూ.100 కోట్ల అంచనాతో సిసి రోడ్లు, 3వేల మినీ గోకులాలు ఏర్పాటు లక్ష్యంగా నిర్దేశించుకుని ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ నిధులు అనుసంధానంతో రూ.243.74 కోట్ల ఖర్చుతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. రూ.10 కోట్ల ఖర్చుతో 1272 ఫాం పాండ్లను పూర్తి చేశామన్నారు. రూ.15 కోట్లతో 1125 పశువుల మినీ గోకులం షెడ్లు పూర్తి చేసుకుని ప్రగతిలో రాష్ట్రంలో మూడవ స్థానం సాధించాం. రూ.73 కోట్లతో 322.78 కిమీ సప్లైఛానల్స్ పనులు పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలో 2027 మంది రైతులకు సంబంధించి 3600 ఎకరాలలో రూ.42 కోట్లతో ఉపాధి హామీ క్రింద ఉద్యాన పంటల పనులు చేశామని పేర్కొన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేసి జీవనోపాదులను వృద్ధి చేయడానికి కృషి చేశామన్నారు. 2024-25లో (గత ఏడాది) రూ.308.47 కోట్లు ఉపాధి హామీ నిధులను ఖర్చు చేశామని పేర్కొన్నారు. రూ.88 లక్షల పని దినాలు ఉపాధి కల్పించి వేతనాల కింద దాదాపు రూ.230 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ రూ.78.47 కోట్లు చెల్లించి 95 శాతం ప్రగతి సాధించినట్లు పేర్కొన్నారు. 1.53 లక్షల కుటుంబాలకు, 2.31 లక్షల వేతన జీవులకు ఉపాధి పనులు కల్పించామని, రోజుకు సగటు వేతనం రూ.261 చెల్లించినట్లు తెలిపారు. జిల్లాలో నీటి ఎద్దడి నివారించడానికి రూ.7.95 కోట్లతో కంటిన్యూజెన్సీ ప్రణాళికను ప్రభుత్వానికి ప్రతిపాదించామని పేర్కొన్నారు. ప్రస్తుతం 116 గ్రామాలలో నీటి సరఫరా జరుగుతోందన్నారు, వేసవి దృష్ట్యా రాబోయే కాలంలో గ్రామాలలో నీటి ఎద్దడి నివారించడానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో దాదాపు నాలుగు నుంచి ఐదువేల పంపుసెట్లు ఉండగా, ఇందులో దాదాపు 1500 పంపు సెట్లకు మరమ్మత్తులు చేయించామని, డిఎంఎఫ్ పథకం ద్వారా బోర్ వెల్స్ చేపట్టడం జరుగుతుందని, సిపిడబ్ల్యు స్కీం సక్రమంగా పనిచేసేలా ఆర్డబ్ల్యూఎస్ శాఖ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్లో 19 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం జరిగిందని, రబీ సీజన్‌లో నమోదైన వర్షపాతం ఆధారంగా నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి ప్రస్తుతం కరువు మండలాలను ప్రకటించలేదని పాత్రికేయులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఆర్ అండ్ బి శాఖ ద్వారా ఏడిబి పథకం కింద జిల్లాలో 380 కిలోమీటర్ల మేర ప్రాధాన్యత రోడ్లు ప్రతిపాదిం చినట్లు తెలిపారు. సమావేశంలో డ్వామా పీడీ వెంకటరత్నం, పిఆర్ ఎస్ఇ దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

వైభవంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ఒంటిమిట్ట రామాలయంలో ధ్వజస్తంభాన్ని శుభ్రం చేస్తున్న అర్చకులు

ఆలయంలో శుద్ధి చేస్తున్న అర్చకులు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

శ్రీకోదండరామస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ నెల 6వ తేదీ నుండి 14వ తేదీ వరకు శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్న నేపథ్యంలో ముందుగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి అర్చన నిర్వహించారు. అనంతరం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. గర్భాలయం, శ్రీఆంజనేయస్వామి, శ్రీగరుత్మంతుని సన్నిధి, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పును నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను ఉదయం 11.30 గంటల నుండి సర్వదర్శనానికి అనుమతించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వాహన సేవల వివరాలు..

ఈ నెల 6వ తేదీ ఉదయం ధ్వజారోహణం (వృషభ లగ్నం) రాత్రి శేష వాహనసేవ, 7న ఉదయం వేణుగానాలంకారం, రాత్రి హంస వాహన సేవ, 8న ఉదయం వటపత్రశాయి అలంకారం, రాత్రి సింహ వాహన సేవ, 9న ఉదయం నవనీత కృష్ణాలంకారం, రాత్రి హనుమత్సేవ, 10న ఉదయం మోహినీ అలంకారం, రాత్రి గరుడసేవ, 11న ఉదయం శివధనుర్భాణ అలంకారం, రాత్రి కల్యాణోత్సవం, గజడ వాహన సేవ, 12న ఉదయం రథోత్సవం, 13న ఉదయం కాళీయమర్ధనా లంకారం, రాత్రి అశ్వవాహన సేవ, 14న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం. 15వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచిమ రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం కార్యక్రమాలుంటాయి.

సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌కుమార్‌రెడ్డి

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

పది నెలల్లో కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందారని, రెడ్ బుక్ కార్యక్రమాలు మాత్రమే అమలు చేస్తున్నారని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రెడ్డప్పగారి రమేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది నెలల్లో కేవలం జగన్ పై నిందలు వేస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేయక హామీలు నెరవేర్చక కాలం గడిపారని పేర్కొన్నారు. 2024 - 25 బడ్జెట్ కానీ, నవంబర్లో నిర్వహించిన ఓటాన్ బడ్జెట్‌లో కానీ కేటాయించిన నిధులను ఇప్పటి వరకు ఎక్కడా ఖర్చు పెట్టలేదని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ అమలు చేయలేదని విమర్శించారు. బిజెపి, జనసేనలతో ఏర్పడిన ప్రభుత్వం టిడిపికి గైడ్ చేస్తారన్న ఆలోచనలతో ప్రజలు అఖండ మెజారిటీ ఇచ్చారని, కానీ వారు ప్రజల ఆశలు వమ్ము చేశారని పేర్కొన్నారు. గతేడాది ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తాని చెప్పి నేడు ఎగ్గొట్టారన్నారు. జగన్ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ల కోసం వెళితే హౌస్ బోర్డు కనబడేదన్నారు. 2024-25 సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య అమాంతంగా తగ్గిపోయిందని, పాఠశాలలు మూతపడే రోజులు వచ్చాయని విద్యా వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని చెప్పారు. శాంతి భద్రతలు క్షీణించాయని, ఒకపక్క వైసిపి నాయకులపైనా, మరోపక్క ఆధిపత్యం కోసం పరస్పర దాడులు చేసుకుంటున్నారని చెప్పారు. గతంలో ఎప్పుడు లేని విధంగా మతసామరస్యం క్షిణించిందని, ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. భూ కబ్జాలు, వీపరీతమైన అవినీతి, ఇష్టారాజ్యంగా టెండర్లు తీసుకోవడం వాటిపై విచారణలు లేవన్నారు. ఇక విద్యుత్ శాఖలో ట్రాన్స్‌ఫార్మర్లు కోసం రైతులు ఎదురు చూస్తున్నారని, రైతులపై ఎందుకింత కక్ష అని ప్రశ్నించారు. కరువు పీడిత ప్రాంతమైన అన్నమయ్య జిల్లాకు కరువు జిల్లాలో చోటు ఇవ్వకపోవడం దారుణమన్నారు. హంద్రీనీవా కోసం రుపాయి ఖర్చు చేయలేదని పేర్కొన్నారు. ఇంతదారుణమైన ప్రభుత్వాన్ని ఎప్పుడు చూడలేదని తెలిపారు. పి-4, పి-5 సర్వేలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు హరున్ బాష, ఎస్.కె హుస్సేన్, సత్యారెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం : కలెక్టర్

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి- కలకడ

గ్రామాలలో భూ సమస్యలను శాశ్వతంగా పరిష్క రించేందుకు రెవిన్యూ సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ అధికా రులను ఆదేశించారు. మంగళవారం మండలాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ పెండ్లిమర్రివాండ్లపల్లెలో సర్వేనెంబర్ 984/4లో ఉన్న 0.04 సెంట్ల భూమిని తన పేరుతో ఆన్‌లైన్ చేయాలని వై.సుబ్బమ్మ ఇటీవల పిజిఆర్ఎస్‌లో దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా సదరు అంశంపై తహశీల్దారు, రెవెన్యూ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో కలెక్టర్ పర్యటించి, రికార్డులను పరిశీలించి, దరఖాస్తు దారురాలుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సదరు భూమి వివాదంలో ఉందని తహశీల్దారు కలెక్టరుకు వివరించారు. ఇరుపార్టీలను పిలి పించి సామరస్యంగా సమస్యను పరిష్కరించాలని తహశీల్దార్‌కు కలెక్టర్ సూచిం చారు. అనంతరం వివిధ అంశాలలో పలు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఫణికుమార్, మండల సర్వేయర్ దేవి, విఆర్ఒ అనంతరాజు, పుల్లయ్య, విఆర్ఎలు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల దాహార్తిని తీర్చేందుకే నీటి తొట్లు

రాయచోటి : వేసవిలో పశువుల దాహార్తిని తీర్చడానికి గ్రామాలలో నీటి తొట్లెల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. మంగళవారం సంబేపల్లి మండలం నాగిరెడ్డిపల్లెలో పశువుల తాగునీటి తొట్టె నిర్మాణానికి, సేద్యపు నీటి కుంట ఫారం పాండ్ నిర్మాణాలకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సమస్యల పరిష్కరించేందుకు, సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నీటి సంరక్షణ చర్యలు చేపట్టి భూగర్భ జలాల వృద్ధికి కూడా ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని తెలిపారు. గ్రామాలలో సేద్యపు నీటి కుంట ఫారం పాండ్లను విస్తృతంగా మంజూరు చేస్తామని పేర్కొన్నారు. త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులు, గ్రామాలలోని ప్రజలందరూ ప్రభుత్వ చర్యలకు సహకరిస్తూ గ్రామాలు అభివృద్ధి బాటలో పయనించేందుకు భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వ పథకాలను, సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని కుటుంబాలు అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకటరత్నం, సంబేపల్లె తహశీల్దారు, ఎంపిడిఒ, మండల స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వడదెబ్బకు గురి కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్త మంచూరులో డాక్టర్ జులేఖ బేగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 104 కార్యక్రమంలో వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత వల్ల శరీర ఉష్ణోగ్రతలు పెరిగి మెదడు మీద ప్రభావం చూపుతుందని, దీనివల్ల మెదడులోని ఉష్ణోగ్రత నియంత్రణ చేసే కేంద్రం దెబ్బతిని వడదెబ్బకు గురికావడం జరుగుతుందని పేర్కొన్నారు. మంచి నీరు ఎక్కువగా తాగాలని, ఒఆర్ఎస్ ద్రావణంను అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి వనిత, ఆశాలు రేవతి, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న మహమ్మద్ రఫీ

ఎఎస్ఐ చంద్రయ్య దంపతులను సన్మానిస్తున్న ఎస్‌పి విద్యా సాగర్ నాయుడు

ఎఎస్ఐ చంద్రయ్య సేవలు మరువలేనివి

- ఎస్‌పి విద్యా సాగర్‌నాయుడు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎఎస్ఐ పి.చంద్రయ్య సేవలు పోలీసు యంత్రాంగం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు ఉన్నారు. మంగళవారం అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మదనపల్లి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎఎస్ఐ పి చంద్రయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్‌పి విద్యా సాగర్ నాయుడు మాట్లాడుతూ ఎఎస్ఐ చంద్రయ్య పోలీస్‌శాఖలో అంకిత భావంతో విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. క్రమశిక్షణతో నిబద్ధతతో విధులు నిర్వహించడంలో పాటు ప్రజలకు అహర్నిశలు సేవలు అందించారని కొనియాడారు. పోలీసు ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నదైనా సమాజ రక్షణ కోసం సేవ చేయడం గొప్ప అని పేర్కొన్నారు. 38 సంవత్సరాలు వివిధ హోదాల్లో విధులు నిర్వహించారని తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) వెంకటాద్రి, ఎఒ బి.కృష్ణుడు, ఆర్ఐలు రామకృష్ణ, పెద్దయ్య, మదనపల్లి ట్రాఫిక్ సిఐ మోహన్ కుమార్, పోలీస్ అధికారులు, మహిళా పోలీసులు, పోలీసు కార్యాలయం సిబ్బంది, ఉద్యోగ విరమణ పొందిన ఎఎస్ఐ చంద్రయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

- వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

బాలికపై లైంగిక దాడికి పాల్పడడంతో నింధితుడిపై పోక్సో కేసు నమోదు చేసిన సంఘటన పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం చోటు చేసుకొంది. వివరాలలోకి వెళితే...కొత్త ఇందిరమ్మ కాలనీకి చెందిన జెసిబి డ్రైవర్ ఇదే ప్రాంతానికి చెందిన బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడని బాలిక కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు జెసిబి డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

తరగతి గదులను తనిఖీ చేస్తున్న జిసిడిఒ మధుమతి

కెజిబివిలో అధికారుల తనిఖీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని ముష్టూరు వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో మంగళవారం జిసిడిఒ మధుమతి, అసిస్టెంట్ జిసిడిఒ శిరీష కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలోని పలు రికార్డులను, ఉపాధ్యాయుల విద్యార్థుల రిజిస్టర్లను, పాఠశాల పరిశుభ్రత, విద్యార్థుల గ్రేడింగ్, తరగతి గదుల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. స్వయంగా పాఠశాల నిర్వహణపై, వసతులపై విద్యార్థులతో వారు ముచ్చటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా పాఠశాలను తాము తనిఖీ చేయడం జరిగిందన్నారు. పాఠశాల నిర్వహణ, వసతులు, నాణ్యమైన విద్యను తాము పరిశీలించామని, సంతృప్తికరంగా ఉందన్నారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం పాఠశాల నిర్వహణ చక్కగా చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం 9వ తరగతి విద్యార్థులకు ముందు చూపు కార్యక్రమంలో భాగంగా ఈనెల 10వ తేదీ వరకు పదవ తరగతి పాఠ్యాంశాలను బోధిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పాఠశాల వాతావరణం చక్కగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ముని వెంకటమ్మ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వీరబల్లి : లబ్ధిదారులకు పింఛన్‌ను అందిస్తున్న జగన్‌మోహన్‌రాజు

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని ఓదివీడు పంచాయతీలో మంగళవారం రాజంపేట టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పంపిణీ చేశారు. పింఛన్లు సక్రమంగా అందుతున్నాయా అని ఈ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు తమకు సక్రమంగానే అందుతున్నాయని, పింఛన్ పెంచడం వల్ల తమకు ఆర్థికంగా మంచి జరిగింది అన్నారు.కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. **కలకడ :** ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్‌ను సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండలంలోని కదిరాయచెరువు పంచాయతీ కదిరాయచెరువు వడ్డేపల్లికి చెందిన రామయ్య కుమారుడు శంకరకు ఎన్టీఆర్ భరోసా కింద రూ.10వేలు రూపాయలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు కార్య క్రమంలో ఎంపిడిఒ అబ్దుల్‌రహీం, బిపిఎం కమలనాద, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న డ్వాక్రా మహిళలు

ఉద్యోగ విరమణ తప్పనిసరి

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండలం వెలుగు కార్యాలయం పనిచేస్తున్న పాపిరెడ్డిపల్లికి చెందిన విఒఎ పాటూరు రామకృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ చెందారు. ఈ సందర్భంగా విఒఎను ఎపిఒ మల్లికార్జునరాజు పూలమాల,దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగం చేసే ప్రతి ఒక్కరికి ఉద్యోగ విరమణ అనేది తప్పనిసరి అన్నారు. రామకృష్ణారెడ్డి విధి నిర్వహణలో నిక్కచ్చిగా, నిజాయితీగా తన వృత్తిని పూర్తి చేశారని పేర్కొన్నారు. ఇలాంటి ఉద్యోగి పదవి విరమణ చెందడం బాధాకరమని అయినా కూడా తప్పదని తెలిపారు. కార్యక్రమంలో పుష్పాంజలి, వెలుగు సిబ్బంది, వెలుగు కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతులకు సరుకులు వితరణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా విభిన్నప్రతిభావంతుల సేవ సమితి ఆధ్వర్యంలో పల్లె చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం మంగళవారం 20 మంది విభిన్నప్రతిభావంతుల కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్లె చంద్రశేఖర్‌రెడ్డి తమ్ముడు పల్లె రఘురామిరెడ్డి కుమారులు మౌనివర్ధన్‌రెడ్డి, అఖిల్‌కుమార్‌రెడ్డి సహకారంతో నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా పల్లె రఘురామిరెడ్డి మాట్లాడుతూ మా అన్న పల్లె చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం విభిన్నప్రతిభావంతులను గుర్తించి, గొప్ప మనసుతో ఆలోచించి సరుకులు అందించామన్నారు. ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా విభిన్న ప్రతిభావంతుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ దివ్యాంగులకు సరుకులు ఇవ్వడం వల్ల వారిపై ఆధారపడిన కుటుంబాలకు చేయూతనందించిన వారవుతారన్నారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మి, జ్యోతి, ఎద్దు సుబ్బరాయుడు, ఆసిఫ్, భద్రుడు, రహమతుల్లా, రమేష్ పాల్గొన్నారు.

రోడ్డును తవ్వారు..వదిలేశారు..!

- నెల రోజులుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు
- పట్టని అధికారులు

ప్రజాశక్తి-చిట్వేలి

ఆ రెండు గ్రామాలకు బస్సు ప్రయాణం లేదు. ఆటోల మీద ఆధారపడి ప్రయాణించాల్సిందే. ఉన్న తారురోడ్డు కూడా జెసిబితో తవ్వేయడంతో నెలరోజులుగా రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల నెలరోజులుగా నరక యాతన అనుభవిస్తున్నామని విద్యార్థులు, రైతులు, కూలీలు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..మండల పరిధిలోని దేవమాచుపల్లి పంచాయితీ దొగ్గలపాడు(రామాపురం) గ్రామం, అదే గ్రామం మీదుగా మాలేమాపురం గ్రామానికి సుమారు మూడు కిలోమీటర్ల మేర దూరం ఉండగా, మాలే మార్పుపురం గ్రామం బ్రిటిష్ కాలంలో హెడ్ క్వార్టర్‌గా కూడా ఉండేది. ఈ గ్రామాల మీదగా గరుగుపల్లి వరకు తారు రోడ్డు వేయించి అక్కడ ప్రజలు ఇబ్బందులు లేకుండా చూడాలని ఉద్దేశంతో 2011-12వ సంవత్సరంలో అక్కడ అప్పటి ప్రజా ప్రతినిధుల అభ్యర్థన మేరకు అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో అప్పటి ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయుడు చొరవతో పిఆర్ నిధులతో రోడ్డును వేయడం జరిగింది. బస్సు రాకపోకలు లేకపోయినా ఈ గ్రామాలకు ఆటోలు సౌకర్యం బాగాఉండేది. ఇటీవల నెల క్రితం, ఉన్న రోడ్డును పూర్తిగా జెసిపితో తవ్వుకుంటూ వెళ్లారు. గతంలో ఉన్న తారు రోడ్డుకు మరమ్మత్తులు చేయకపోగా పూర్తిస్థాయిలో తవ్వేయడం జరిగింది. నూతన రోడ్డు నిర్మిస్తారేమో అన్న ఆశపడ్డ ప్రజలు గత నెల రోజులుగా నరకం అనుభవిస్తున్నారు. ఈ గ్రామాలకు బస్సు రాకపోకలు లేకపోగా రోడ్డును తవ్వడం వలన ఆటోలు కూడా రాకపోకలు నిలిపివేశారు. ఇక ద్విచక్ర వాహనాలు సైతం నడవాలంటే పోలేని పరిస్థితి ఏర్పడింది. రోడ్డు నిర్మించేవారు కొంచెం, కొంచెం అయిన ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్డు చేసుకోకపోగా, పూర్తిస్థాయిలో రోడ్డును తవ్వడం వలన ముఖ్యంగా మధ్యతరగతి రైతులకు ఆటోలు రాకపోకలు నిలిపివేయడంతో పండిన పంటలను, పంటలకు ఎరువులను తీసుకెళ్లడం సవాలుగా మారింది. ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాలకు గుంతలు లేని రోడ్డు నిర్మించాలని దృఢ సంకల్పంతో ముందుకు వెళుతుంటే ఈ గ్రామాలకు మాత్రం ఉన్న రోడ్డును తవ్వేసి నరకం చూపిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నెల రోజుల నుంచి పడుతున్న అవస్థలను గమనించి త్వరితగతిన రోడ్డు నిర్మించడమా లేదా ప్రత్యామ్నాయం చూపాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జెసిబితో తవ్విన కంకరరోడ్డు

సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

నీటి తొట్లకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రాచవేటివారిపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. స్థానిక సర్పంచ్ సుబ్రమణ్యం(మధు), రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్, టిడిపి మండలాధ్యక్షులు పుర్ర వెంకటరమణ, మాజీ ఎంపిపి రెడ్డప్పరెడ్డి, ఇటుకల బట్టి చంద్ర, టిడిపి నాయకులు, ప్రభుత్వ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా చేపడుతున్న పశువులకు తాగునీటి తొట్టెల నిర్మాణానికి స్థానిక సర్పంచ్, టిడిపి నాయకులతో కలసి భూమిపూజ చేశారు. అనంతరం పింఛనుదారులకు ఎన్‌టిఆర్ భరోసా పింఛను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధిని నీరుగార్చారని, రాష్ట్ర ఖజానాను దివాలా తీయించారని అన్నారు. విరివిగా అప్పులు చేయడంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా కుంటుబడి పోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుస్తూ, ప్రజల సంక్షేమానికి అండగా నిలుస్తూ, అభివృద్ధికి కృషి చేస్తోందని అన్నారు. కూటమి ప్రభుత్వ లక్ష్యం సంక్షేమం, అభివృద్దేనని గుర్తు చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఇప్పటికే వేల కిలోమీటర్లు పల్లెల్లో సిసి రోడ్లను, మురుగనీటి కాలువలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం మరో మారు ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ ద్వారా పశువులకు తాగునీటి తొట్టెల నిర్మాణానికి చర్యలు చేపట్టిందని అన్నారు. మండలంలో 30 తొట్టెలను నిర్మిస్తుండగా, ఒక్కొక్క తొట్ట విలువ సుమారు రూ.32 వేలు అన్నారు. ఉపాధి హామీ కూలీలకు 100 రోజుల పని దినాలకు అదనంగా మరో 50 రోజుల పని దినాలను కల్పించి ప్రభుత్వం వారికి అండగా నిలిచిందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్ కల్యాణ్‌కు ప్రజలు ఎల్లప్పుడూ రుణపడి ఉండాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజన్న, సుధాకర్ రావు, నరసింహారెడ్డి, శంకర, సుధాకర్, శ్రీపతి, మహమ్మద్ రఫీ, ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, ఎపిఒ రమేష్, ఎపిఎం మురళి, పశువైద్యాధికారి సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **పీలేరు:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పశువులకు తాగునీటి తొట్టెలు నిర్మిస్తున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు వెంకటరత్నం తెలిపారు. మంగళవారం పీలేరు మండలం, ఎర్రగుంటపల్లి పంచాయతీ, ముడుపులవేముల వారి పల్లెలో పశువుల తాగునీట తొట్టెల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేయించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రస్తుతం ముంచుకొస్తున్న వేసవితాపాన్ని దృష్టిలో ఉంచుకుని నోరులేని జీవాలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 29 నీటి తొట్టెల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసిందని అన్నారు.కార్యక్రమంలో పీలేరు ఎంపిడిఒ శివశంకర్, ఎపిఒ అశోక్‌రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు వారణాసి శ్రీకాంత్ రెడ్డి, పీలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి, మాజీ టిడిపి మండల అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, ఎర్రగుంటపల్లి పంచాయతీ నాయకులు ముడుపుల వేముల అమర్నాథ్ రెడ్డి రైతులు పాల్గొన్నారు. **రామాపురం :** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో మండల ంలోని 13గ్రామ పంచాయతీ లలో పశువులకు దాహార్తించడానికి 39 నీటి తొట్టెలు మంజూరైనట్లు ఉపాధి హామీ ఎపిఒ పెంచలయ్య తెలి పారు. మండలంలోని నీలకంఠరావుపేట గ్రామంలో నీటి తోట్లులకు ఆయన ఇసి శివయ్యతో కలిసి కొలతలు వేసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి మంజూరైన నీటి తొట్లను ఈనెల 10 తేదీ లోపు నిర్మాణం పూర్తి చేయాలని డ్వామా పీడీ ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత వేసవిసీజన్‌లో పశువుల దాహార్తి తీర్చడానికి ప్రభుత్వం చేపట్టిందన్నారు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహబూబ్ బాషా, టెక్నికల్ అసిస్టెంట్ , ఫీల్డ్ అసిస్టెంట్ పెంచల్ రెడ్డి, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు. **వీరబల్లి :** పశువులకు నీటి తొట్ల నిర్మాణ పనులకు టిడిపి మండల అధ్యక్షుడు భానుగోపాల్ రాజు భూమి పూజ చేశారు. గడికోట పంచాయతీ పెద్దూరు కస్పా లో రూ.33 వేలతో నీటి తొట్టి నిర్మించుటకు రాష్ట్ర ప్రభుత్వం వేసవి కాలంలో పశువులకు నీటి సమస్య రాకుండా ఉండేందుకు పాడి రైతుల సంక్షేమానికి విశేష కృషి చేస్తుందని తెలిపారు.

పీలేరు: నీటి తొట్లకు భూమిపూజ చేస్తున్న నాయకులు, అధికారులు

తేజస్వినిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : మండలంలోని కన్యమడుగు చెందిన రఘురాంరెడ్డి, నాగవేణి దంపతుల కుమార్తె తేజస్విని సిఎంఎలో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్, సిఎ ఫైనల్‌లో ఆలింఇండియా 14వ ర్యాంకు సాధించడంతో మంగళవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆమెను శాలువతో సత్కరించి అభినందించారు. క్రమ శిక్షణ పట్టుదలతో ఆలిండియాలో ర్యాంకు సాధించడం అందరికీ ఆదర్శవంతమన్నారు. తేజస్విని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ శివకుమారి, మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్ నాయకులు రవి శంకర్ రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మామిడి తోటకు నిప్పు

ప్రజాశక్తి-కలకడ : సంబేపల్లి మండలం ఎస్ సోమవరం పంచాయతీ దేవాలయం పేటకు చెందిన షేక్ ఖాదర్‌బాషా తన పొలంలో సుమారు 80 చెట్లకు పైగా మామిడిచెట్లు నాటి పెంచి పోషిస్తున్నట్లు తెలిపారు. ఈ చెట్లను గత 15 సంవత్సరాల క్రితం నాటినట్లు తెలిపారు. నాటినప్పటి నుండి నేటి వరకు నీటిని సరఫరా చేస్తూ కాపాడుకుంటున్నాని తెలిపారు. కాయలు కాసి పూతతో ఉన్న చెట్లు ఇలా అగ్నికి ఆహుతి కావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యాహ్నం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు మామిడి తోటకు వేసిన తోటకు నిప్పు తగలడంతో వేసవి కాలం కాబట్టి మామిడి తోటలో ఉన్న గడ్డి పూర్తిగా ఎండి ఉండటంతో మంటలు చెలరేగి పూతతో కాయలతో నిండి ఉన్న సుమారు 50 మామిడి మొక్కలు అగ్నికి ఆహుతి అయినట్టు తెలిపారు. సుమారు లక్ష రూపాయలకు పైన ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఉంటుందని మామిడి తోట యజమాని కన్నీటి పర్యంతం అయ్యాడు. ప్రభుత్వం స్పందించి మామిడి ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

కాలిపోయిన మామిడి చెట్లు

కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న ఎంపిడిఒ

'ఉపాధి' కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందజేత

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రానున్న మూడు నెలలు వేసవిని దృష్టిలో పెట్టుకుని ఉపాధిహామీ పనులు చేయుచున్న కూలీలందరూ వడదెబ్బ బారిన పడకుండా ఉండడానికి ముందు జాగ్రత్తగా మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ దిలీప్‌కుమార్, ఒఆర్ఎస్ పాకెట్స్ ఫీల్డ్ అసిస్టెంట్లకు అందించినట్లు ఎపిఒ వెంకటేష్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఫీల్డ్‌లో తప్పనిసరిగా నీడ, నీరు పని ప్రదేశంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు పని దినాలలో తప్పనిసరిగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయాలన్నారు.

మైనర్ల చేతికి ద్విచక్ర వాహనాలు

-పెరుగుతున్న ప్రమాదాలు

- నిబంధనలు కఠినతరం చేయాలని ప్రజల విజ్ఞప్తి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మైనర్లకు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు ఇవ్వడంతో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. మంగళవారం స్థానిక బైపాస్ రోడ్డులో మైనర్లు అతివేగంగా ద్విచక్ర వాహనంలో వచ్చి ఎదురుగా వస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బషీర్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బషీర్‌తో పాటు ఆయన ఏడేళ్ల కుమారుడు గాయపడ్డారు. స్థానికులు హుటాహుటిన వారిని దిగవ బస్టాండులోని ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఇదేచోట బైపాస్ రోడ్డులో అతివేగంగా ద్విచక్ర వాహనాల్లో విన్యాసాలు చేసుకుంటూ చక్కర్లు కొట్టినట్లు పలువురు పోలీసులకు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మైనర్లను పోలీస్ స్టేషనుకు తరలించారు. సిఐ జీవన గంగానాథ్ బాలుడి తల్లి తండ్రి పిలిపించి తల్లితండ్రులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయమని పోలీసులకు తెలిపారు. గత కొద్దీ కాలంగా బి.కొత్తకోటలో మైనర్ బాలుల ఆగడాలు అంతులేవని చెప్పవచ్చు. కళాశాలలు, పాఠశాలలు వదిలే సమయంలో మైనర్లు అధిక వేగంతో భారీ శబ్దాలతో బైపాస్ రోడ్డు, పట్టణంలో వికృతి చేష్టలకు పాల్పడుతున్న పోలీసులు మాత్రం ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని లేనిపక్షంలో ఇటువంటి ప్రమాదాలు రాబోవు కాలంలో ఎన్ని చూడాల్సి వస్తుందోనని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే 'పుట్టా' కృషి అభినందనీయం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గంలోని అయిదు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కృషి అభినందనీయమని టిడిపి నాయకులు కొనియాడారు. మైదుకూరు టిడిపి కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో మైదుకూరు, చాపాడు, బి.మఠం, ఖాజీపేట, దువ్వూరు మండలాలను కరువుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. నియోజకవర్గ రైతుల అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే పనిచేస్తున్నారని ప్రశంసించారు. 40ఏళ్ల చరిత్రలో ఎప్పుడు కూడా మైదుకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన చరిత్ర లేదన్నారు. కరువు మండలాల వల్ల రుణాలు రీ షెడ్యూల్, పంట నష్ట పరిహారం, విత్తన పంపిణీ తదితర అనేక లాభాలు రైతులకు కలుగు తాయన్నారు. మైదుకూరు మున్సిపాలిటీకి తాగునీటి సరఫరా, సుందరీకరణ నిధుల మంజూరు, కరువు మండలాలుగా ప్రకటించడం పట్ల ఎమ్మెల్యే కృషి అభినందనీయమన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు ధనపాల జగన్, పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎపి రవీంద్ర, బి మఠం, దువ్వూరు, చాపాడు, మైదుకూరు, ఖాజీపేట మండలాల అధ్యక్షులు సుబ్బారెడ్డి, రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, భీమయ్య, లక్ష్మిరెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

శిక్షణ పడిన ముద్దాయితో పోలీసు సిబ్బంది

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో డ్రైవర్‌కు జైలుశిక్ష

ప్రజాశక్తి-రామాపురం

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో సుమో డ్రైవర్ సత్య మోహన్‌కు ఐదేల్లు జైలుశిక్ష , రూ.3లక్షలు జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచం దనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ఎఫ్ ఎస్ఒ భరణి కుమార్ తెలిపారు. పాలకొండలోని రాయచోటి రేంజి వంగిమల్ల సెక్షన్ సరస్వతిపల్లె బీట్ లోని పత్తి కనుమరాస్తాలో 2019మే నెల17న సుమోలో అక్రమంగా నాలుగు ఎర్రచందనం దుంగలను తరలిస్తుండగా పట్టుబడిన కేసులో తిరుపతి ఎర్రచం దనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఐదేళ్లు జైలుశిక్ష, రూ.3లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ముద్దాయిని పట్టుకున్న కేసులో అప్పటి ఫారెస్ట్ అధికారులు ఎఫ్ఎస్ఒ శ్రీరాములు, ఎఫ్‌బిఒలు భరణి కుమార్, రఘుపతిరాజు, కృష్ణప్రసాద్ ఉన్నారు.

కారు, బైక్ ఢీ : వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

కారు, ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటన మంగళవారం నిమ్మనపల్లి మండలంలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు..వాయల్పాడుకు చెందిన బలస సాయికృష్ణ చౌడేపల్లి నుంచి తన కారులో వాయల్పాడుకు వస్తుండగా నిమ్మనపల్లి-మదనపల్లి రోడ్డు మార్గంలోని పిట్టావాండ్లపల్లె సమీపంలోకి రాగ పెద్దమాదిగపల్లెకు చెందిన గణేష్ తన బుల్లెట్‌లో కుటుంబ సభ్యు లతో కలసి మదనపల్లె వైపు వెళ్తుండగా కారు, బైకు ఎదురెదురుగా ఢీకొని ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదంలో గణేష్ కాళ్లకు తీవ్ర గాయం కాగా, తన కుమారుడికి స్వల్ప గాయాలు అయ్యాయన్నారు. బాధితులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-రామసముద్రం

మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. అరికెల పంచాయతీ నాగనపల్లి గ్రామానికి చెందిన చిలకవారిపల్లి గణేష్ భార్య మౌనిక సోమవారం నుంచి కనివి ంచక పోయినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఎక్కడైనా ఆమె ఆచూకీ లభ్యం అయితే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

మౌనిక (ఫైల్ ఫోటో)

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) రాజంపేట
E.P.No : 46/2016 In
O.S.No : 85/2014
శిద్దా శివారెడ్డి S/o రామకృష్ణా రెడ్డి, ఎర్రి పాపాయగారి పల్లె (V), H/o పాటూరు, నందలూరు మండలం, అన్నమయ్య జిల్లా. ...పిటిషనర్ (D.Hr)
V/s
1. మాచుపల్లి కృష్ణమూర్తి S/o late సుబ్బన్న రిటైర్డ్ రైల్వే పాయింట్స్ మెన్
2. మాచుపల్లి ఎల్లమ్మ పోతి వారసులు
3. మాచుపల్లి కృష్ణమూర్తి S/o late సుబ్బన్న
4. మాచుపల్లి రమేష్ S/o మాచుపల్లి కృష్ణమూర్తి
5. మాచుపల్లి సురేష్ అలియాస్ సుధాకర్, S/o కృష్ణమూర్తి
6. మాచుపల్లి శ్రీధర్ S/o కృష్ణమూర్తి
పై అందరిదీ నివాసం D.No:3/63-1, అరవపల్లి (V), నందలూరు (Po)&మండలం, అన్నమయ్య జిల్లా.
...రెస్పాండెంట్లు (J.Drs)
SALE NOTICE
పిటీషనర్, 1 to 6 రెస్పాండెంట్లు మీద E.P. షెడ్యూల్ దాఖలా ఆస్తిని వేలం వేయమని పై E.P. దాఖలు చేసియున్నారు. కావున 1 to 6 రెస్పాండెంట్లుకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 25.04.2025 వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై మనవి చేసుకోనంతట పరోక్షమున తీర్మానించబడును.
//By Order of the Court//
A.V. సుబ్రహ్మణ్యం, B.Com., B.L.,
అడ్వకేట్,
నందలూరు, Cell :94401 29650.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) రాజంపేట
I.P.No : 16/2024
కొనిరెడ్డి జయరామ కృష్ణారెడ్డి S/o late జయరామిరెడ్డి, అనంతం పల్లి (V), రెడ్డిపల్లి (Po), పుల్లంపేట మండలం, అన్నమయ్య జిల్లా. ...పిటీషనరు
V/s
కోడూరు పెంచలయ్య, S/o సుబ్బన్న, D.No:1/78, జానకి పురం (V), పెరియవరం (Po), పుల్లంపేట మండలం, అన్నమయ్య జిల్లా. ...2వ రెస్పాండెంట్
నోటీసు
పిటీషనరు 2వ రెస్పాండెంట్ మరియు ఇతరుల మీద పిటిషనరును ఇన్సాల్వెంట్ గా డిక్లేర్ చేయమని పై పిటిషన్ దాఖలు చేసియున్నారు. కావున 2వ రెస్పాండెంట్ కు ఏవైనా ఆక్షేపణలు ఉన్నయెడల 23.04.2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు హాజరై మనవి చేసుకోవలెను. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.
//By Order of the Court//
A.V. సుబ్రహ్మణ్యం, B.Com., B.L.,
అడ్వకేట్,
నందలూరు,
Cell :94401 29650.

RAJAMPET MUNICIPALITY
e-procurment Tender Notice

S.No.	'e'- Procurement Notice No.	Number of Works	Estimate Contract Value (In Lakhs)
1	01/GF/DEE/AE/2025-26 to 02/GF/DEE/AE/2025-26	2	12.85
	Bid document download start date	02.04.2025, 10.00 AM	
	Bid document download end date	16.04.2025, 3.00 PM	
	Last date of receipt of Tender	16.04.2025, 3.30 PM	
2	03/vehicle/DEE/AE/2025-26	1	4.20
	Bid document download start date	02.04.2025, 10.00 AM	
	Bid document download end date	09.04.2025, 3.00 PM	
	Last date of receipt of Tender	09.04.2025, 3.30 PM	

Further Details can be seen @ 'e' Procurement market place in https:tender.apeprocurement.gov.in/ , Contract No: 9989051971.
Commissioner
Rajampet Municipality